క్లుప్తంగా

స్కూటరిస్ట్‌కు గాయాలు

ఏర్పేడు: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ స్కూటరిస్ట్ గాయపడినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న మినీ వ్యాను ఏర్పేడు స్టేట్ బ్యాంకు సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న శ్రీకాళహస్తికి చెందిన సుబ్రమణ్యం(43) గాయపడ్డాడు. చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ


బాలాజీనాయక్, కమిషనర్

శ్రీకాళహస్తి: ఆస్తి పన్ను, ఖాళీజాగా పన్నుపై వడ్డీ మాఫీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ జీవో ఎంఎస్ నెం. 34ఎం.ఏ ఉత్తర్వుల మేరకు మున్సిపాలిటీలో ఆస్తి, ఖాళీ జాగా పన్నులను ఈ ఆర్థిక సంవత్సరంలోపు చెల్లిస్తే వడ్డీ మొత్తం మాఫీ చేస్తామని పేర్కొన్నారు. పన్నులను మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్, వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మకర తోరణం బహూకరణ


మకర తోరణం అందజేస్తున్న కృష్ణయ్య దంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీవీర రాఘవ స్వామివారికి అలంకరించేందుకు శుక్రవారం పట్టణానికి చెందిన ఉప్పు కృష్ణయ్య దంపతులు మకర తోరణాన్ని కానుకగా అందజేశారు. దీని విలువ రూ.25వేలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. దాతకు స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

తిరుపతి అర్బన్: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయలక్ష్మి, ఏపీ బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు లక్ష్మీదేవితో కలిసి మాదకద్రవ్యాల నివారణ, మానవ అక్రమ రవాణా నిరోధానికి చేపట్టాల్సిన చర్యలపై సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఫోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ డి.ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అష్టోత్తర శత దీర్ఘ సుమంగళి వ్రతం


అష్టోత్తర శత దీర్ఘ సుమంగళి వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుపతి కల్చరల్: వేశాలమ్మ ఆలయంలో శుక్రవారం అష్టోత్తర శత దీర్ఘ సుమంగళి వ్రతం వేడుకగా నిర్వహించారు. ఇందులో తిరుపతి, తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి సుమారు 500 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. వేద పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ అష్టోత్తర శత దీర్ఘ సుమంగళి వ్రతం శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీ, కన్నయ్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

23న టూరిస్టు బస్టాండ్ వేలం

తిరుచానూరు(చంద్రగిరి): 2023–24 ఆర్థిక సంవత్సరానికి తిరుచానూరు గ్రామ పంచాయతీ ప్రైవేటు టూరిస్టు బస్టాండ్, షాపింగ్ కాంప్లెక్సు గదులకు ఈ నెల 23న వేలం పాటలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీల్డ్ టెండర్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. సాయంత్రం 3 గంటలకు వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు(చంద్రగిరి): పద్మావతి అమ్మవారిని శుక్రవారం మహారాష్ట్ర మాజీ సీఎం శివాజీ రావు పాటిల్, వెస్ట్ బెంగాల్ ఎలక్షన్ కమిషనర్ సౌరబ్ కెఆర్ రాయ్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు

ఆలయ జీర్ణోద్ధరణ పనులు వేగవంతం

- పూర్వయిన మూలమూర్తి తొలగింపు
- 23న వరదరాజస్వామి ఆలయ
- పునర్నిర్మాణానికి భూమి పూజ


విగ్రహం కింద లభించిన నాణేలు


వరదరాజస్వామి విగ్రహానికి ముసుగు వేసి తరలిస్తున్న ట్రస్టుబోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు వేగవంతం అయ్యాయి. శుక్రవారం శ్రీప్రసన్న వరదరాజస్వామి మూలమూర్తిని శాస్త్రోక్తంగా తొలగించారు. ఈ సందర్భంగా పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ మూలవిరాట్ పానమట్టం మధ్యలో అష్టమూలికా పంచాయతన బంగారు రేకులు ఉన్నట్లు తెలిపారు. పానం మట్టం మధ్యలో 37 బంగారు రేకులు, రెండు కాసులు లభించాయన్నారు. వాటిని ఆలయ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 23న ఆలయ పునర్నిర్మాణ భూమిపూజ చేస్తామన్నారు. మూలమూర్తిని పానమట్టం నుంచి అతి జాగ్రత్తగా వేరుచేసినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు మురళీధర్, సతీష్‌మాలిక్, లోకేష్, నాగభూషణం, శ్రీనివాసన్‌రెడ్డి, కిషోర్, సూర్యప్రసాద్, స్థపతి కుమార్, లక్ష్మయ్య, ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఉచిత దంతవైద్య శిబిరం


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న కేర్ ఆసుపత్రి వైద్యులు

వరదయ్యపాళెం: శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేర్ ఇంటర్నేషనల్ డెంటల్ ఆస్పత్రి నుంచి ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం శ్రీహరి కోటకాలనీ, తొండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి నోటి శుభ్రత, దంత సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శ్రీసిటీలోని కేర్ ఇంటర్నేషనల్ ఆసుపత్రి, కోల్గేట్ పామోలివ్ పరిశ్రమ, శ్రీసిటీ ఫౌండేషన్‌లు సంయుక్తంగా శ్రీసిటీ పరిధిలోని 14 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులకు వారం రోజులపాటు ఉచిత దంతవైద్య శిబిరాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు. వైద్యులు స్వరూప్ కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ పర్యవేక్షణలో దంత చికిత్సలు కొనసాగనున్నాయి.

ముక్కంటి సేవలో ఏఆర్ డీజీపీ


రాహుకేతు పూజల్లో సతీష్ గొల్హా

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం అరుణాచల్‌ప్రదేశ్(ఏఆర్) డీజీపీ సతీష్ గొల్హా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదుపరి ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చి, స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఒకటో పట్టణ సీఐ అంజుయాదవ్, ఆలయ అధికారులు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆకర్ష్‌రెడ్డి జన్మదిన వేడుకలు


వృద్ధులకు పంచెలు అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని మర్రిమందలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఆకర్ష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి పంచారు. 350 మంది వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు నాగరాజురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ధనుంజయులురెడ్డి, రమణారెడ్డి, చంద్రారెడ్డి, మోహనకృష్ణ, హేమాద్రి, షేక్ బాషా, ఏకాంబర రెడ్డి, వసంతమ్మ, జ్ఞానమ్మ పాల్గొన్నారు.

పూర్ణాశ్రమం స్థల ఆక్రమణను అడ్డుకోండి


ఎస్‌ఐకు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాహకురాలు లక్ష్మి

సత్యవేడు: కొత్తమారికుప్పం పరిధిలోని పూర్ణాశ్రమానికి కేటాయించిన స్థలం ఆక్రమణను అడ్డుకోవాలని నిర్వాహకురాలు జి.లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్ఐ పురుషోత్తం రెడ్డి పూర్ణాశ్రమం ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించారు. సచివాలయం సిబ్బందిచే భూసర్వే చేయించుకుంటే స్థలంలో కంచె వేయించేందుకు సహకరిస్తామని ఎస్ఐ తెలిపారు.

తిరుపతిలో మోస్తరు వర్షం



వర్షపు నీటిలో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు, శ్రీవారి ఆలయం ఎదుట


వర్షంలో వెళుతున్న వాహనదారులు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో మోస్తరు వర్షం పడింది. వడగండ్లు కూడా పడ్డాయి. దీంతో నగరం తడిసి ముద్దయింది. కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు కొంత ఉపశమన పొందారు. లీలా మహల్ సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్, మధురా నగర్, చేపల మార్కెట్ రోడ్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది.

తిరుమలలో

తిరుమల: అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం రాత్రి తిరుమలలో వర్షం కురిసింది. దీంతో శ్రీవారి భక్తులు తడిసి ముద్దయ్యారు. వేసవి నేపథ్యంలో వర్షం కురవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

చట్టాలపై అవగాహన అవసరం

తిరుపతి తుడా: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ తెలిపారు. స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా మహిళల లైంగిక వేధింపుల నివారణపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళల సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. ఉద్యోగినుల రక్షణ, భద్రతకు యా జమాన్యమే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలోనూ మహిళా దినోత్సవం నిర్వహించారు. న్యాయవాది మమత, డాక్టర్లు ప్రతిభ, ఎంఎం సుచిత్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయండి


డీజీపీ రాజేంద్రరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని కోరారు. విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణం విస్తరించుకుంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. ఆలయ పట్టణం కూడా కావడంతో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకు డీజీపీ సానుకూలంగా స్పందించారు.

దేవాలయాలు మానసిక వికాస కేంద్రాలు


భూమి పూజ చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): దేవాలయాలు మానసిక వికాస కేంద్రాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి పవిత్రా రెడ్డి అన్నారు. శుక్రవారం మండ లంలోని పెద్దిగుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారాముల ఆలయ నిర్మాణ భూమిపూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆలయాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. ఉత్సవాల నిర్వహణ ద్వారా ఐక్యత పెంపొందుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, చోడవరం సర్పంచ్ వెంకటరమణారెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి భక్తవత్సలం, నాయకులు జయరాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణయ్య, మణి, సంజీవ్‌రెడ్డి, నాగరాజు, ప్రసాద్, రంగయ్య పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి



స్టెమ్ ల్యాబ్ ప్రారంభంలో ఎంఈఓ, ప్రగతి సంస్థ ప్రతినిధులు

రేణిగుంట: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించి నూతన ఆవిష్కరణలను తీసుకురావాలని రేణిగుంట ఎంఈవో ఇందిరాదేవి అన్నారు. మండలంలోని కరకంబాడి హైస్కూల్‌లో సన్ టీవీ నెట్‌వర్క్, బెంగుళూరుకు చెందిన చైల్డ్ రైట్స్ అండ్ యూ సంస్థ సహకారంతో రూ.15లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన స్టెమ్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రగతి సంస్థ సన్ నెట్‌వర్క్ సాయంతో పాఠశాలకు సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రయోగశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా గణితం, సైన్స్ అభ్యాసంలో విద్యార్థులకు ఉన్న భయాలను, సందేహాలను ఈ ల్యాబ్ ద్వారా అతి సులువైన పద్ధతిలో తీర్చుకోవచ్చని తెలిపారు. హైస్కూల్ హెచ్‌ఎం తీగల ఆనంద్, ప్రగతి కోఆర్డినేటర్ తులసీరాంరెడ్డి, జయలక్ష్మి, రెడ్డిలక్ష్మి, శివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొయ్య ఎస్సీకాలనీలో వైద్య శిబిరం


వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పొయ్య ఎస్సీ కాలనీలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'ప్రబలుతున్న విషజ్వరాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. మండల వైద్యాధికారి తేజేశ్వరి ఆధ్వర్యంలో గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. మలేరియా, టైఫాయిడ్ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యం అందించారు. మూడురోజుల పాటు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి పేర్కొన్నారు. గ్రామస్తులు తాగునీటి కలుషితంపై ఫిర్యాదు చేయగా, వాటి శాంపుల్స్ సేకరించి తిరుపతిలోని ప్రజారోగ్యశాఖకు పరీక్షల నిమిత్తం పంపుతున్నట్లు తెలిపారు. పారిశుధ్యంపై గ్రామస్తులకు వివరించారు. పీహెచ్ఎన్ సంపూర్ణ, ఏఎన్ఎం బుజ్జమ్మ, డిల్లీరాణి, ఎంఎల్‌హెచ్‌పీలు లిఖిత్ కుమార్, శిరీషా, ఇందువదన, ఆశాకార్యకర్తలు సుబ్బమ్మ, నాగేంద్ర, పంచాయితీ సెక్రటరీ చెంచయ్య పాల్గొన్నారు.


అలిపిరి వద్ద లగేజీ కేంద్రం వద్ద పోటెత్తిన భక్తులు


లగేజీ కేంద్రంలోకి ఒక్కసారిగా చొచ్చుకుపోతున్న భక్తులను అదుపు చేస్తున్న సిబ్బంది

పోటెత్తిన భక్తులు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో కాలినడకన వెళుతున్నారు. ఈ క్రమంలో తిరుపతిలోని అలిపిరి మెట్ల మార్గం వద్ద ఉన్న లగేజీ కౌంటర్‌లో లగేజీని డిపాజిట్ చేయడానికి రావడంతో రద్దీ నెలకొంది. క్యూలైన్లల్లో లగేజీలతో భక్తులు పడిగాపులు కాశారు. సిబ్బంది కౌంటర్లు తెరవడంతో ఒక్క సారిగా కేంద్రంలోకి ఎగబడ్డారు. గేట్లను సైతం లెక్క చేయకుండా దూసుకెళ్లారు. వారిని అదుపు చేసేందుకు విజిలెన్స్ సిబ్బంది నానా తిప్పలు పడ్డారు. మరోవైపు నడక దారిలో భక్తులు మొదటి మెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుని తిరుమలకు పయనమయ్యారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి


లగేజీలను డిపాజిట్ చేసేందుకు గేట్లలో దూరుతున్న భక్తులు


లగేజీలతో నిండిపోయిన కేంద్రం

టెక్నాలజీపై దృష్టి సారించాలి


ఐఐటీ ప్రొఫెసర్‌ను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ విద్యార్థులు అకడమిక్ సిలబస్‌తో పాటు నూతన టెక్నాలజీపై దృష్టి సారించాలని ఐఐటీ ప్రొఫెసర్ వై.కాళిదాసు పిలుపునిచ్చారు. కరకంబాడీ రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆవిష్కర్–2023 పేరుతో జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఇందులో వివిధ కళాశాలల విద్యార్థులు పలు అంశాలపై ప్రదర్శన ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో పోటీ పడేందుకు చదువు ఒక్కటే సరిపోదన్నారు. చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు విరివిగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.జయచంద్ర, కన్వీనర్ ఎం.హేమలత పాల్గొన్నారు.